ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.7 । కనిష్ఠం 25.8

నిర్మల్
జిల్లా వార్తలు

ఆదివారం 25 మే 2025


# కర్షకుని కన్నీటికి కారకులెవ్వరు?



- ముందస్తుగా వర్షాలున్నాయని తెలిసినా కొనుగోళ్లపై చిన్నచూపే
- ఇంకా కొనుగోలు కేంద్రాల్లోనే 51 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం
- తాజాగా పంట కల్లాల్లో తడిసి మొలకెత్తిన ధాన్యం
- హమాలీల కొరత సృష్టించిన వారిపై మండి పడుతున్న రైతాంగం
- జిల్లా వ్యాప్తంగా ధాన్యం మొలకలు రావడంతో ఆదుకోవాలని వేడుకుంటున్న రైతాంగం



నిర్మల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : పంట పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వ లేక ఎంతో మంది రైతులు అప్పు తెచ్చుకొని మరీ పంట వేసుకుంటారు. వేసిన పంటను రాత్రనకా పగలనకా ఎండనకా వాననకా శ్రమించి కంటికి రెప్పలా కాపాడుకుంటారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి చీడపీడల నుంచి పంటను నానా తంటాలు పడి పండించుకుని తాను ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకొని ఆ పంటసాగు చేసేందుకు అప్పిచ్చిన రుణదాతకు అప్పు కట్టి మిగిలిన నాలుగు రాళ్లతో తన కుటుంబాన్ని నడిపేందుకు కలలు కన్న రైతన్నకు చివరికి కన్నీరే మిగిలిన పరిస్థితి తలెత్తుతోంది. జిల్లావ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటకల్లాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. అకాలవర్షానికి ధాన్యం తడిసి పోవడంతో అన్నదాత కన్నీటి పర్యంతమవుతున్నాడు. ముందస్తుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ కొంతమంది కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల ధన దాహంతో ఆ కొనుగోలు కేంద్రాలలో సరిపడా హమాలీలను ఏర్పాటు చేయకపోవడంతో నేడు వర్షపు నీటికి ధాన్యం తడిసి మొలకలెత్తిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఏ మండలంలో చూస్తున్న కొనుగోలు కేంద్రాల్లో దిగాలుగా కూర్చున్న రైతులు దర్శనమిస్తున్నారు. ఈ రైతుకు కలిగించిన తన కన్నీటి బాధని చెబితే గుండె తరుక్కుపోతుంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తమ కళ్ల ఎదుట వర్షపునీటిలో తడిసిపోయి మొలకలు రావడంతో ఏం చేయాలో పాలు పోక అన్నదాత ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితికి ప్రకృతి బీభత్సం ఒక కారణమైతే అధికారుల నిర్లక్ష్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల ధన దాహం మరో కారణమని రైతులు మండి పడుతున్నారు.

### కొనుగోలులో కనిపించని వేగం

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే తీరాన్ని తాకనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తూ వచ్చింది. నైరుతి రుతుపవనాలు తీరాన్ని తాకకముందే రాష్ట్రంలో వసరుగా నాలుగు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందంటూ రెండు మూడు రోజుల ముందే వాతావరణ శాఖ నుంచి ప్రకటనలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో వానొస్తుందని ముందే తెలిసినా ధాన్యం కొనుగోళ్లలో ముందస్తు చర్యలు మాత్రం కనిపించ లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం గతంతో పోలిస్తే ఒక అడుగు ముందుకేసి పంటచేతికి రాకముందే ఈ యాసంగిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాల ప్రారంభం కేవలం ఆరంభ సూరత్వంగానే మిగిలిపోయిందంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ధాన్యం తూకం చేయడంలో మాత్రం తీవ్రజాప్యం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది యాసంగిలో ధాన్యం సేకరణ లక్ష్యం ఒక లక్ష 60 వేల మెట్రిక్ టన్నులకు పైగా ఉండగా ఇప్పటి వరకు సేకరించిన 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమేనని అధికారులే లెక్కలు చెబుతున్నారు. ఇంకా 51 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం పంటకల్లాల్లోనే మగ్గుతోంది. రుతుపవనాలు సైతం కేరళ తీరాన్ని తాకనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్న నేపథ్యంలో రానున్నమూడు నాలుగు రోజుల్లో మరిన్ని వర్షాలు కురిస్తే ఇక పంట కల్లాల్లో ధాన్యం పరిస్థితి ఏంటని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కొనుగోలు కేంద్రాల్లో మొలకెత్తిన ధాన్యం

జిల్లావ్యాప్తంగా గత మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తడిసి ముద్దయిన ధాన్యం శనివారం పలుచోట్ల మొలకలెత్తి కనిపించింది. తమ కళ్ల ముందరే ధాన్యం తడిసిపోయి మొలకెత్తుతున్నది చూసి రైతు కన్నీటి పర్యంతమవుతున్నారు. తమ కష్టం వర్షపు నీటి పాలయ్యిందని దుఃఖిస్తున్నారు. ధాన్యం మొలకెత్తడంతో ఏం చేయాలో తెలియక ఎక్కడ చూసిన కొనుగోలు కేంద్రాలలో దిగాలుగా కూర్చున్న రైతులే దర్శనమిస్తున్నారు. ఒక్క ఖానాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే వందల క్వింటాళ్ల ధాన్యం మొలకలెత్తిందని రైతులు చెబుతున్నారు. ఖానాపూర్ శ్రీరాం నగర్‌కు చెందిన నాగుల మల్లయ్య అనే రైతు తాను సాగు చేసిన 5 ఎకరాలలో 10 ట్రాక్టర్ల ధాన్యాన్ని పండించాడు. సదరు రైతు 10 ట్రాక్టర్ల ధాన్యం మొలకెత్తిపోవడంతో ఆయన కన్నీటి పర్యంతమవుతున్నాడు. పది ట్రాక్టర్ల ధాన్యం ఆరురోజుల క్రితమే సరిపడా తేమ శాతం వచ్చిందని తూకం వేయాలంటే హమాలీల కొరత ఉందని సెంటర్ నిర్వాహకులు తన ధాన్యాన్ని తూకం వేయలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పుడు తన పరిస్థితి ఏంటని తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కన్నీటి పర్యంతమవుతున్నాడు. ఒక సెంటర్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే జిల్లావ్యాప్తంగా వేల క్వింటాళ్ల ధాన్యం మొలకెత్తి రైతులు నష్టపోయారని ఈ పరిస్థితిపై వెంటనే సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం అందజేయాలని పలువురు కోరుతున్నారు.

### కర్షకుని కష్టానికి కారకులెవరు

ప్రకృతి కన్నెర్ర చేయడంతోనే రైతన్న కష్టాల పాలవుతున్నాడన్నది పైకి కనిపిస్తున్నప్పటికీ అన్నదాత ఈ కష్టానికి అసలు కారకులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులేనని రైతులు మండి పడుతున్నారు. కాయ కష్టం చేసి పండించిన పంటను అమ్ముకునేందుకు పంట కల్లాలకు చేరిన రైతన్నకు కొనుగోలు కేంద్రాలలో సెంటర్ నిర్వాహకులు గత రెండు నెలలుగా చుక్కలు చూపిస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేరుకే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలని చెబుతున్నప్పటికీ ఈ కొనుగోలు కేంద్రాలలో రైతన్నను సెంటర్ నిర్వాహకులు నిలుపు దోపిడీ చేస్తున్న అడిగేవారు లేకపోవడంతో సెంటర్ నిర్వాహకులు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు చెబుతున్నారు. క్వింటాల్ ధాన్యం తూకం వేసేందుకు రైతు వద్ద రూ. 40 సేకరించి బీహార్ నుంచి తీసుకొచ్చిన కూలీలకు ఒక బస్తాకు రూ. 12 చొప్పున క్వింటాల్‌కు కేవలం 30 రూపాయలే చెల్లించారు. క్వింటాల్ ధాన్యం వెంట అదనంగా తరుగు పేరిట సుమారు 6 కిలోల వరకు దండుకుంటున్నారని చెబుతున్నారు. ఇలా ఒక్కో క్వింటాల్ ధాన్యం వెంబడే 130 నుంచి 140 రూపాయల వరకు అదనంగా అన్నదాతను దోచుకుంటున్న నేపథ్యంలో కనీసం ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీహార్ ప్రాంతం నుంచి తమ చెప్పు చేతుల్లో ఉండే కొంతమంది కూలీలను మాత్రమే తెచ్చి నత్తనడకన ధాన్యం తూకం సగిస్తుండటమే నేటి ఈ పరిస్థితికి కారణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జరిగిన నష్టానికి కేవలం ప్రకృతిని నిందించకుండా తూకంలో నిర్లక్ష్యం చేసిన కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకుని జరుగుతున్న అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో వర్షాలు కురవడంతో కొనుగోలు కేంద్రాలన్నీ చెరువులను తలపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జరుగుతున్న ఈ దోపిడీలో అధికారులతో పాటు పాలకులకు సైతం వాటా ఉండడంతోనే అన్నదాతను పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్న నిర్వాహకులపై విజిలెన్స్ విచారణ చేపట్టి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



### తూకం వేయకపోవడంతో పది ట్రాక్టర్ల ధాన్యం మొలకెత్తింది

**నాగులు మల్లయ్య, రైతు శ్రీరాంనగర్, ఖానాపూర్**

5 ఎకరాలలో 10 ట్రాక్టర్ల ధాన్యం పండించాను. ఖానాపూర్‌లోని మార్కెట్ యార్డ్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి పది రోజుల క్రితం ధాన్యం తెచ్చాను. తెచ్చిన నాలుగు రోజులకే 18 శాతం తేమ వచ్చింది. ధాన్యం తూకం వేయాలని ఆరు రోజులుగా సెంటర్ నిర్వాహకుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. దీంతో ఈ అకాల వర్షానికి 10 ట్రాక్టర్ల ధాన్యం తడిసిపోయి మొలకలు వచ్చాయి. ఇప్పుడు ఏం చేయాలో నాకు పాలుపోవడం లేదు. ప్రభుత్వం నన్ను ఆదుకోవాలి.

### తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**కుర్మె చందు, వరి రైతు, దిలావర్‌పూర్**

అకాల వర్షంతో తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయాలి. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లను చూసి ఏడవని రైతు లేదు. ఎంతో కష్టపడి పండించి అమ్ముకునే సమయానికి వానొచ్చి అంతా ఆగమాగం చేసింది. ఎలాంటి కోతలు లేకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి మమ్మల్ని ఆదుకోవాలి.



### ధాన్యం దోపిడీ.. తూకం జాప్యంలో ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దల పాత్ర

**రితేష్ రాథోడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు**

జిల్లాలో ప్రస్తుతం రైతుల దుస్థితికి అధికారుల సోమరితనమే కారణం. వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ముందస్తుగా హెచ్చరించినప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేశారు. తరుగు పేరిట జరుగుతున్న దోపిడీలో హమాలీల పేరిట జరుగుతున్న దోపిడీలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దల పాత్ర ఉండటంతోనే ధాన్యం తూకంలో జాప్యం చేశారు. ధాన్యం తడిసిపోయే పరిస్థితి వస్తే రైతులు తాము అడిగినంత తరుగు ఇస్తారని జిల్లా ఉన్నతాధికారులు. మిల్లర్లు, ప్రభుత్వ పెద్ద కలిసి పన్నిన కుట్రతోనే నిర్మల్ జిల్లాలో పంట కల్లాల్లో ధాన్యం తడిసి మొలకలు వచ్చింది. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న పలు రకాల దోపిడీపై విజిలెన్స్ విచారణ నిర్వహించి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి. జరిగిన నష్టంపై సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం అందజేయాలి.

---

## ఏసీబీకి చిక్కిన కడెం సర్వేయర్

- రూ. 7వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత


పట్టుబడ్డ సర్వేయర్ పవర్ ఓమాజీ

కడెం, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వేయర్ పవర్ ఓమాజీ శనివారం ఓ రైతు నుంచి రూ. 7వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కడెం మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన గుగ్లావత్ ప్రభాకర్ రైతు. తన తండ్రి మరణానంతరం భూమి పట్టా మార్పిడి గురించి ప్రభాకర్ ఇటీవల మండల సర్వేయర్ పవర్ ఓమాజీని సంప్రదించాడు. అయితే ఇందుకు లంచంగా రూ. 20 వేలు ఇవ్వాలని సర్వేయర్ డిమాండ్ చేశాడు. ఇందుకు ఒప్పుకున్న ప్రభాకర్.. వారం రోజుల క్రితం రూ.12 వేలు ఇచ్చాడు. భూ పట్టాల మార్పిడి పూర్తయ్యాక మిగతా డబ్బులు ఇస్తానని చెప్పాడు. అయితే మిగతా డబ్బులు కూడా వెంటనే ఇవ్వాలని, ఆ తర్వాతే పని చేస్తానని ప్రభాకర్‌ను సర్వేయర్ వేధించాడు. దీంతో విసుగు చెందిన రైతు ప్రభాకర్.. ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారం.. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌కు రైతు రూ. 7వేల లంచం ఇస్తుండగా.. ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

విద్యార్థినుల భద్రతకు

## ఏ సమస్య ఉన్నా ఫిర్యాదు చేయండి


ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా షీ టీం ఇన్‌చార్జి అధికారి

నిర్మల్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినిల భద్రతకు సంబంధించిన ఏ సమస్య ఉన్న నిర్భయంగా ఫిర్యాదు చేయాలని షీ టీం జిల్లా ఇన్‌చార్జి అధికారి ఎస్సై పెర్సిస్ అన్నారు. ఎస్పీ ఆదేశాలతో శనివారం పట్టణంలోని నారాయణ స్కూల్‌లో పోక్సో చట్టాలు, చైల్డ్ మ్యారేజ్, జువెనైల్ చట్టాలు, గంజాగస్తీ ప్రోగ్రామ్, ఈవ్ టీజింగ్, మహిళల రక్షణపై ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పిల్లలకు అవగాహన కల్పించే విధంగా షీ టీం ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి వాడకం పూర్తిగా రూపు మాపడానికి ప్రతీ ఒక్క టీచర్ తమవంతు సహకారం చేస్తూ సమాచారం ఉన్న లేదా తమ వద్ద చదువుకునే పిల్లల నడవడిక అనుమానాస్పదంగా ఉంటే వెంటనే 87126 59599 అనే నంబర్‌కి సమాచారం అందించాలన్నారు. మహిళలు వేధింపులకు గురైతే షీటీం నెంబర్ 8712659550 లేదా డయల్ 100కు ఫిర్యాదు చేస్తే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సుమారు 200ల మంది పాల్గొన్నారు.

## పాలిసెట్‌లో మెరిసిన జిల్లా విద్యార్థిని

- రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంక్ సాధించిన సాయి సాత్విక


విద్యార్థిని సాయి సాత్వికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శారద

నిర్మల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశం కోసం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పాలిసెట్ పరీక్షలో నిర్మల్‌కు చెందిన గెంటెల సాయి సాత్విక తొమ్మిదవ ర్యాంక్ సాధించారు. మొత్తం 120 మార్కులకు గాను సాయి సాత్విక 118 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. గెంటెల సంతోష్‌కుమార్ కళ్యాణిల కూతురైన సాయి సాత్విక స్థానిక మేధామోరల్ స్కూల్‌లో పదవ తరగతి వరకు చదివారు. కాగా తమ స్కూల్‌కు చెందిన విద్యార్థిని సాయి సాత్విక రాష్ట్రస్థాయి పాలిసెట్ పరీక్షలో తొమ్మిదవ ర్యాంక్ సాధించిన సందర్భంగా మేధా మోరల్ స్కూల్ ప్రిన్సిపాల్ శారద, వైస్ ప్రిన్సిపాల్ సిద్ధార్థరెడ్డిలు ఘనంగా సన్మానించారు.

## జీతాలు రాకపోతే అగ్రిమెంట్ రద్దు చేసుకోవాలి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నర్సాపూర్(జి), మే 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి జీతాలు విడుదల చేయకుంటే జూన్ ఫస్ట్ నుంచి కాంట్రాక్టర్ అగ్రిమెంట్ రద్దు చేయాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డాక్టర్లను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎక్స్‌రే సెంటర్‌ను ప్రారంభించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి 8 నెలల నుండి జీతాలు రాలేదని మహేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి డాక్టర్‌లను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతీయ రహదారి వెంబడి అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, స్థానికంగా ఉన్న ఈ ఆసుపత్రిని గత ప్రభుత్వం 50 పడకల ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించినా ఆచరణలో మాత్రం చేపట్టలేకపోయిందన్నారు. కనీస వసతులు, సిబ్బంది కొరత తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత మేరకు ప్రభుత్వ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మహేశ్వర్‌రెడ్డి ప్రసంగిస్తుండగా ఏసీ నుండి నీరు కారిపోవడంతో ఒక్కసారిగా ఆసుపత్రి అధికారులపై మండిపడ్డారు.

### ధాన్యం కల్లాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. మొలకెత్తిన ధాన్యం సైతం ప్రభుత్వం కొనాలని రైతు ముత్యం కన్నీరు కార్చారు. ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే కొనుగోలు కేంద్రాల వద్ద రెండు వారాల పాటు పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. త్వరితగతిన వడ్ల కొనుగోలు పూర్తి చేయాలని, బస్తా 3 కిలోల 200ల గ్రాములు తూకం చేశారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధిక తూకం వేసి ఇప్పటి వరకు రైస్‌మిల్లులకు తరలించిన 26 లారీల ధాన్యాన్ని రికవరీ చేస్తామని ఏపీఎం సునందను ఎమ్మెల్యే నిలదీశారు. అధిక తూకం వేసి పంపిన మిల్లుల వివరాలు సేకరించిన మిల్లులపై విచారణ చేసి అధిక తూకం వేసిన రెండు కిలోలలను రికవరీ చేయాలని తహసీల్దార్ శ్రీకాంత్‌ను ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. కటింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, రావుల రాంనాథ్, ముత్యంరెడ్డి, చంద్రకాంత్, మండల అధ్యక్షులు బర్కుంట నరేందర్, స్థానిక నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అర్జున్, మహిపాల్, దత్తురాం, రాజేందర్, రాజు, వైద్య అధికారులు రాజేందర్, ప్రమోద్ చంద్రారెడ్డి, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నిర్మల్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ పట్టణం, నిర్మల్ రూరల్, మామడ, లక్ష్మణచాంద, సోన్, సారంగాపూర్, దిలావర్‌పూర్, నర్సాపూర్ మండలాలకు చెందిన 158 మంది లబ్ధిదారులకు శనివారం 45 లక్షల 41 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేసుకున్నవారు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రావుల రాంనాథ్, జిల్లా, పట్టణ, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

### తండాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఏలేటి

సారంగాపూర్, మే, 24 : (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల సిరిపెల్లి, బంద్రేవ్ తండాలలో శనివారం అభివృద్ధి పనులకు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐటీడీఏ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టం జరిగిందన్నారు. సిరిపెల్లి తండా నుండి బండరేవు వరకు బీటీ రోడ్డుకు రూ. 75 లక్షలు అలాగే నాగపూర్ పీఆర్ రోడ్డు నుండి దేవితండా వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు రూ. 37 లక్షలు నిధులు మంజూరయ్యాయని అన్నారు. ఈ నిర్మాణ పనులు వెంటనే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, కాల్వ నరేష్, రాంశంకర్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, ముత్యం రెడ్డి, రాజేంధర్‌రెడ్డి, సాహెబ్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, నారాయణ, విలాస్, ప్రకాష్, వీరయ్య, పోతన్న, నర్సయ్య, రాజురెడ్డి, తిరుమలచారి, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, వినోద్, గద్దర్, జగదీష్, చాణక్య, నవీన్‌తో పాటు కార్యకర్తలు తండా వాసులు ఉన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న బీజేఎల్పీ నేత ఏలేటి

## పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



తానూర్, మే, 24 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్ఝురి గ్రామానికి చెందిన గరకే లక్ష్మణ్ (29) పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఏఎస్‌ఐ నర్సింగ్‌భాను తెలిపారు. ఏఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు లక్ష్మణ్‌కు గత రెండేళ్ల క్రితం పాము కాటువేయడంతో నడుముకు సర్జరీ అయింది. దీంతో నడుము నొప్పి బాధ భరించలేక శుక్రవారం సాయంత్రం తన సొంత చేనులో మద్యం సేవించాడు. మత్తులో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు సేవించాడు. కొన ఊపిరితో ఉన్న లక్ష్మన్‌ను స్థానికులు భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

లక్ష్మణచాంద

## నూతన ఎస్సైగా శ్రీనివాస్


లక్ష్మణచాంద నూతన ఎస్సై జి. శ్రీనివాస్

లక్ష్మణచాంద, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల నూతన ఎస్సైగా (సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్) జి.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భైంసా టౌన్ ఎస్సైగా పనిచేసిన ఆయన ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి లక్ష్మణచాందకు బదిలీపై వచ్చారు. ఇదివరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎస్సైగా విధులు నిర్వహించిన ట్రైనీ ఎస్సై సుప్రియ భైంసా రూరల్ ఎస్సైగా బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శ్రీనివాస్‌ను తోటి సిబ్బంది సహా నాయకులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు.

## నేడు జీపీఓ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



నిర్మల్ అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో నేడు (ఆదివారం) నిర్వహించనున్న గ్రామపాలన అధికారుల నియామక పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు అన్నీ పూర్తయ్యాయని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 9 గంటల లోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. చాణక్య హైస్కూల్ (రెడ్డి ఫంక్షన్‌హాల్ సమీపంలో)లో పరీక్షాకేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. సెల్‌ఫోన్ సహా ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను తప్పని సరిగా తీసుకురావాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

### విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి


విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ఎద్దు

దిలావర్‌పూర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నంద ముత్యం అనే రైతుకు చెందిన ఎద్దు గ్రామశివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శనివారం సాయంత్రం విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. వ్యవసాయ పనుల కోసం ఎద్దును తీసుకెళ్లిన ముత్యం సాయంత్రం మేత కోసం ఎద్దులను వదిలాడు. అయితే పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుండటంతో ఎద్దు మేత మేస్తూ అటువైపు వెళ్లి విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేయడంతో పాటు ఎద్దును కోల్పోయిన రైతుకు నష్టపరిహారం ఇవ్వాలని దిలావర్‌పూర్ గ్రామస్థులు కోరుతున్నారు. కాగా మృతి చెందిన ఎద్దు విలువ రూ. 80 వేలు ఉంటుందని రైతు నంద ముత్యం తెలిపారు.

### ..అల్లంపల్లి గ్రామంలో ఆవు మృతి


మృతి చెందిన ఆవు

కడెం, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పాలరేగడి గ్రామానికి చెందిన గిరిజన రైతు పెంద్రం మధు ఆవు కరెంట్‌షాక్ తగిలి మృతి చెందింది. 23న దత్తోజిపేట గ్రామ సమీపంలో మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలకు తగిలి కరెంట్ షాక్‌కు గురై మృతి చెందినట్టు బాధిత రైతు మధు తెలిపారు. మృతి చెందిన ఆవు విలువ రూ. 40 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు ఉన్నతా ధికారులకు కోరారు.

### 26న లైసెన్స్ సర్వేయర్ల ధ్రువ పత్రాలు పరిశీలన

నిర్మల్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను ఈ నెల 26న చేపట్టనున్నట్లు కొలతల భూ దస్త్రాల నిర్వహణ శాఖ అధికారి శనివారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత శిక్షణలో భాగంగా అభ్యర్థుల వివరాలను మీసేవ పోర్టల్‌తో పాటు జిల్లా సర్వే కార్యాలయం, కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

## ప్రజా దర్బార్.. ఒక పరిష్కార వేదిక

● కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): సమస్యలతో వచ్చిన వారికి క్యాంపు కార్యాలయం ఒక చక్కటి పరిష్కార వేదికగా నిలుస్తుందని అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల కోసం ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ పరిధి నుంచే కాకుండా జిల్లా నుంచి ప్రతిరోజు ప్రజలు తమకష్టాలు చెప్పుకునేందుకు ప్రజాసేవా భవన్ గడప తొక్కుతారన్నారు. ఈ సందర్భంగా వివిధ కారణాలతో తరలివచ్చిన ప్రజలతో, పార్టీ శ్రేణులతో క్యాంపు కార్యాలయం కిక్కిరిసిపోయింది.

## పాలీసెట్ ఫలితాల్లో ఐదవ ర్యాంకు

నేరడిగొండ, మే 24(ఆంధ్రజ్యోతి): పాలీ సెట్ ప్రవేశం కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పాలిటెక్నిక్ పరీక్షల ఫలితాలు శనివారం వెలువడ్డాయి. మండలంలోని నవర్గామ్ గ్రామానికి చెందిన విద్యార్థి జాదవ్ రిషి ఆరాధ్య పాలిసెట్-2025 రాష్ట్రంలో 5వ ర్యాంకు సాధించింది. దీంతో విద్యార్థిని రిషిఆరాధ్యను గ్రామస్థులు అభినందించారు. ఆమె తండ్రి జె.ధానాజీ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు.

## సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్‌లో ఉత్తమ ప్రతిభ

ఉట్నూర్, మే24 (ఆంధ్రజ్యోతి): శనివారం విడుదల చేసిన సైనిక్ స్కూల్ ప్రవేశాల ఫలితాలలో ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన కరూరి జయశ్రీ-రామకృష్ణ దంపతుల కుమారుడు కనురే రోహిత్‌కు ఉమ్మడి జిల్లాలో ఫస్ట్ ర్యాంకు వచ్చింది. చిన్నతనం నుంచి చదువులో భాగా రాణిస్తుండడంతో తల్లిదండ్రులు నిర్మల్ జిల్లాలోని కల్లూరులో ఉన్న ఓ మోడల్ స్కూల్‌లో శిక్షణ ఇప్పించారు. జాతీయ స్థాయిలో 148వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. ఉత్తమ ఫలితం సాధించిన రోహిత్‌ను గ్రామస్థులు సన్మానించారు.

## 'బౌద్ధులపై దాడులను ఖండిస్తున్నాం'

ఇంద్రవెల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): బౌద్ధ అనుయాయులపై మతోన్మాద శక్తులు జరిపిన తీవ్రంగా ఖండిస్తున్నామని, బుద్ధుని విగ్రహాన్ని తొలిగించడం సరైనది కాదని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కార్యదర్శి వాగ్మారే కాంరాజ్ అన్నారు. శనివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రాళ్ల బోరిగాం గ్రామంలో బౌద్ధ అనుయాయుల పై దాడి చేయడం సిగ్గు చేటని అన్నారు. బుద్ధుడు విగ్రహాన్ని అధికారులు తొలగించడం దేనికి సంకేతమని అన్నారు. బుద్ధుడు విగ్రహాన్ని తొలిగించిన చోటే మళ్లీ ప్రతిష్ఠించాలని ప్రభుత్వాన్ని కోరారు.



మాట్లాడుతున్న వాగ్మారే కామరాజ్

### ఉల్లాస్ యాప్ ద్వారా

# వంద శాతం అక్షరాస్యత సాధనకు కృషి చేయాలి

● అధికారుల సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్

తలమడుగు, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఉల్లాస్ యాప్ ద్వారా వంద శాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన మండలంలోని అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఆయా గ్రామాల్లో చదువుకోని వారిని గుర్తించి, చదువుపై వారికి అవగాహన కల్పించాలని కోరారు. అలాగే బడిబాట కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ముఖ్య పాత్ర వహించాలని ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లలో అన్ని సౌకర్యాల ఏర్పాట్లు జరిగాయని, ప్రతీఒక్కరు వివరించాలని తెలిపారు. చదువుకోని వారిని ప్రత్యేకంగా ఒక యాప్‌లో నమోదు చేసే విధంగా ఉల్లాస్ యాప్ ప్రభుత్వం తీసుకు వచ్చిందని, ప్రభుత్వ బడులకు పిల్లలు వచ్చేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని ప్రచారం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమావేశంలో మండలంలో సీజనల్ వ్యాధులు, బడిబాట, చదువుకోని వారిని గుర్తించడం, అంగవైకల్యం ఉన్న వారిని గుర్తించడం అంశాలను తెలపడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. వాటి అమలుకు అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సీసీ, క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు ప్రతీ ఒక్కరు బాధ్యతగా ఇచ్చిన విధులను నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్ రావు, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, ప్రాథమిక కేంద్రం వైద్యులు హరీష్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఏపీఎం శేఖర్, ఎంపీవో వినోద్, ఏపీవో మేఘమాల, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

నేరడిగొండ, మే 24(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో కృష్ణవేణి అన్నారు. శనివారం మండలంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన ప్రభుత్వం ఆమోదించిన కంపెనీ విత్తనాలే విక్రయించాలని, ప్రతిరైతుకు విధిగా రసీదు తప్పకుండా ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం ఆమోదించని విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాల కృత్రిమ కొరత సృష్టించిన ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాలలో ఎలాంటి అనుమతులు లేకుండా నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

● నేరడిగొండలో విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో ➤



# అన్నంలో బొద్దింకలు.. కుళ్లిన చికెన్.. పాడైన గుడ్లు!

● విస్తుపోయిన కస్టమర్.. సోనాలలోని ఓ దాబాలో నిర్వాకం

బోథ్, మే 24(ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని ఓ దాబా హోటల్‌లో భోజనం చేసేందుకు వెళ్లిన వ్యక్తికి అన్నంలో బొద్దింక ప్రత్యక్షమైంది. దీంతో యువకుడు ఇదేమిటని భోజనం సరఫరా చేసిన వారిని అడుగగా.. పొరపాటు జరిగిందని పేర్కొనడం గమనార్హం. గత ఆరు నెలల క్రితం నిర్మల్ జిల్లా కేంద్రంలోని హోటల్‌లో కల్తీ ఆహారం తిని మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్న యువతి మృతి చెందడం జరిగింది. ఆ సంఘటన మరిచిపోక ముందే.. శనివారం సోనాల మండల కేంద్రంలోని దాబా హోటల్లో బొద్దింక ప్రత్యక్షం కావడం కలకలం రేపింది.

జిల్లా కేంద్రంలో మినహా ఇతర మండలాలలో హోటళ్ల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో హోటళ్ల నిర్వాహకులను అడిగే వారే కరవయ్యారు. భోజనాన్ని వారికి నచ్చిన రీతిలో తయారు చేయడంతో పాటు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. అంతేకాకుండా.. మండల కేంద్రంలోని దాబా హోటల్లో ఫ్రిజ్‌లో కుళ్లిన మాంసం, చికెన్ ఉంచి కూరగా వండి వడ్డిస్తున్నారు. హోటల్లోకి వెళ్లి పలువురు వినియోగదారులు ఫ్రిజ్‌లో ఉన్న కుళ్లిన మాంసం చికెన్ ఏమిటని నిలదీయగా.. హోటల్లో పనిచేసే కార్మికులు ఫ్రిజ్‌లో ఉన్న మాంసం గుడ్లు బయట పడేశారు. అలాగే ఇంట్లో వినియోగించే సిలిండర్లు హోటల్లో, దాబా హోటల్‌లో వినియోగిస్తున్న సిలిండర్లు గృహ అవసరాల కోసం వినియోగించేవి కావడం గమనార్హం. అంతేగాక సిలిండర్‌ల వినియోగంపై సైతం పట్టించుకునేవారు లేకపోవడంతో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. కాగా, బంధనలకు విరుద్ధంగా నడుపుతున్న హోటళ్లకు పరిశీలించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లా అధికారులు హోటల్ నిర్వాహకులపైన చర్య తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. డబ్బులు పెట్టి ముగిగిన మాంసం, కుళ్లిన గుడ్లు చికెన్ తినాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఈ రూట్‌లో వెళ్లే సుదూర ప్రాంతాల ప్రయాణికులు విధిలేని పరిస్థితుల్లో వాస్తవాలు తెలియకుండా హోటల్లో భోజనం చేస్తున్నారని పరిశీలకులు అంటున్నారు.





● బొద్దింక పడ్డ అన్నం, ఫ్రిజ్‌లో ఉన్న కుళ్లిన చికెన్, పాడైనా గుడ్లు



విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మద్యం సీసాలు

## మద్యం అమ్మకాలు ధమాల్!

(5వ పేజీ తరువాయి...)

ఎస్పీ ప్రత్యేక దృష్టిని సారించడంతో లిక్కర్ వ్యాపారులంతా సైలెంటై పోయారు. ఇప్పటికే పలువురు బెల్ట్ షాపు నిర్వాహకులతో పాటు వీడీసీల పై కేసులు నమోదయ్యాయి.

### వ్యాపారుల అంచనాలు తారుమారు

లిక్కర్ షాపులను దక్కించుకున్న వ్యాపారులు ఈసారి భారీ లాభాలను రాబట్టేందుకు ప్లాన్ వేసినా.. జిల్లా ఎస్పీ ఝలక్‌తో అంచనాలు తారుమారైనట్లు తెలుస్తుంది. ముందు చూపుతో కొందరు వ్యాపారులు మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు పలు గ్రామాలు, వార్డుల్లో బెల్ట్‌షాపులను ఏర్పాటు చేసేందుకు లక్షల రూపాయలను పెట్టుబడిగా పెట్టినట్లు సమాచారం. లిక్కర్ సేల్స్‌ను పెంచుకునేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్లారు. కొందరైతే వీడీసీలకు ముందే రూ.లక్షల్లో టెండర్ సొమ్మును ముట్టచెప్పినట్లు తెలుస్తుంది. తీరా బెల్ట్‌షాపులు మూతబడడంతో పెట్టిన పెట్టుబడులను వెనక్కి తీసుకునేందుకు పడరాని తంటాలు పడుతున్నారు. వైన్స్ షాపులకు ప్రధాన ఆదాయ మార్గంగా మారిన బెల్ట్‌షాపులను మూసివేయడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నట్లు చెబుతున్నారు. కొందరు లిక్కర్ వ్యాపారులైతే రాజకీయ పరమైన ఒత్తిళ్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు కూడా చేసినట్లు తెలిసింది. ఈ ప్రయత్నం కూడా బెడిసి కొట్టడంతో ప్రస్తుతం లిక్కర్ వ్యాపారులంతా తర్జన భర్జన పడుతున్నారు. ఈ సారి పోటీ పడి మరి వైన్స్‌షాపులను దక్కించుకున్న ప్రయోజనమే లేకుండా పోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

నార్నూర్, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన జాదవ్ సబు బాయి అనే రైతుకు చెందిన రూ.60 వేలు విలువగల దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. బాధిత రైతు కథనం ప్రకారం.. శనివారం ఉదయం ఎద్దులను మేతకు విడిచిపెట్టినట్లుగా తెలిపారు. ప్రకాష్ వారి చేను దగ్గర మేత మేస్తున్న ఎద్దుపై విద్యుత్ వైర్ పడి షాక్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని వేడుకున్నాడు.

## రైతు చేత పుస్తకావిష్కరణ

తాంసి, మే 24(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ ఉదారి నారాయణ రచించిన యాపచెట్టు కాడ ఉరి మీది ముచ్చట్లు అనే పుస్తకావిష్కరణను శుక్రవారం ప్రారంభించారు. ఈ పుస్తకావిష్కరణ సావర్గావ్ గ్రామంలో ఉత్తమ రైతు సత్వాజి పంట చేనులో శనివారం ఆవిష్కరించారు. ఆ రైతు చేతనే ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రచయిత డాక్టర్ ఉదారి నారాయణ మాట్లాడుతూ నేటి సమాజంలో జరుగుతున్న విషయాలనే ఇందులో రచించడం జరిగిందన్నారు. రైతులు వేప చెట్ల కాడ, పొలం గట్ల మీద ఎలాంటి ముచ్చట్లు పెట్టుకుంటారో పూర్తి సమాచారాన్ని ఇందులో తెలపడం జరిగిందన్నారు. ఇందులో రచయితలు డాక్టర్ గంగయ్య, రాములు, జీవన్, కరంజి రమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల వల్ల రైతులు ఆందోళన చెందవద్దు

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

భైంసా రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు. భైంసా మండలం వానల్‌పాడ్ గ్రామంలో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తేమ శాతం పేరుతో రైతులను వేధించవద్దన్నారు. లారీలను సత్వరం రప్పించి, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని తరలించవలసిందిగా అధికారులకు సూచించారు. హమాలీలను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసుకొని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రైతులకు సంబంధించిన పూర్తిస్థాయి ధాన్యాన్ని కొనుగోలు చేయిస్తానని, అవసరమైతే రైతుల పక్షాన పోరాటం చేస్తానని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాల్సిందిగా అధికారులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు బి. శంకర్, పట్టణ అధ్యక్షులు రావుల రామ్‌చందర్ పటేల్, సాయిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సారంగాపూర్, మే, 24 : (ఆంధ్రజ్యోతి) : వృత్తి నైపుణ్య శిక్షణను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సంగీత అన్నారు. శనివారం గురుకుల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యానగర్ అభ్యసించిన పూర్వ విద్యార్థులకు అవగాహన కల్పించి వృత్తి శిక్షణ నైపుణ్యంపై 30 రోజుల పాటు ఇచ్చే శిక్షణకు 18 నుంచి 25 సంవత్సరాల వయసు కలిగిన పూర్వ విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 30 చివరి వరకు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## క్రీడా అకాడమీ, వసతి గృహాల్లో ప్రవేశాలకు ఎంపిక

నిర్మల్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వివిధ క్రీడా అకాడమీ, వసతి గృహాల్లో 2025-26 సంవత్సరానికి గాను ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్, సైక్లింగ్, రెజ్లింగ్, హాకీ, హ్యాండ్ బాల్, వాలీబాల్‌లో ఆసక్తి, అర్హులైన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఉరి వేసుకొని యువకుడి మృతి



కుభీర్, మే, 24 : (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుభీర్‌కు చెందిన చాకలి సుభాష్ (31) ఉరి వేసుకొని మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం మృతుడు సుభాష్ గత ఆరు సంవత్సరాలుగా పిల్లలు పుట్టడం లేదని బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లో ఎవరు లేని సమయం చూసి తన ఇంట్లో చీర సహాయంతో దులానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఘనంగా టీపీసీసీ అధ్యక్షులు జన్మదిన వేడుకలు

నిర్మల్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నగరేశ్వర వాడ శివాలయంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ జన్మదినం సందర్భంగా శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించినట్లు ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ సంయుక్త కన్వీనర్ ఎంబడి రాజేశ్వర్ తెలిపారు.

# 'ఆపరేషన్ సింధూర్'తో భారత సైన్యం పరాక్రమం ప్రపంచానికి తెలిసొచ్చింది

● బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్

● ఖానాపూర్‌లో ఘనంగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

ఖానాపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : 'ఆపరేషన్ సింధూర్'తో భారత సైన్యం పరాక్రమం ప్రపంచానికి తెలిసొచ్చిందని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ అన్నారు. శనివారం ఖానాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్ర ర్యాలీకి రితేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రితేష్ రాథోడ్ మాట్లాడుతూ... పహల్గాంలో భారతీయులను పొట్టన పెట్టుకున్న ఉగ్రమూకలకు భారత్ సరైన సమాధానం చెప్పిందన్నారు. దేశ ప్రజలకు నష్టం కలిగిస్తే భారత్ ఎలా ధీటుగా సమాధానం ఇస్తుందో భారత సైన్యం నిరూపించిందన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌ను ప్రపంచ దేశాల ఎదుట దోషిగా నిలబెట్టడంలో ప్రధాని నరేంద్ర మోదీ విజయవంతమయ్యారన్నారు. అనంతరం పట్టణంలోని జంగల్ హనుమాన్ నుండి తిరంగా ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీకి పలువురు యువకులు హాజరై జాతీయ జెండాలను పట్టుకుని పట్టణ పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. పట్టణంలోని రాజీవ్‌నగర్, ఎన్టీఆర్ చౌక్, విద్యానగర్, పద్మావతి నగర్, వివేకానంద చౌక్, తెలంగాణ తల్లి చౌరస్తా, పాత బస్టాండ్, బస్టాండ్ మీదుగా తిరంగా ర్యాలీ శోభాయాత్ర సాగింది. భారత సైన్యం ధైర్య సాహసాలను కీర్తిస్తూ సాగిన ఈ శోభాయాత్రకు మండల నలుమూలల నుంచి యువకులు భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్, పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్, పెంబి అధ్యక్షులు ఐదు వెంకటేష్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు మంత్రరాజం సురేష్, అల్లాడి వెంకటేశ్వర్లు, హిందూ వాహిని నాయకులు తరుణ్, మహిళా మోర్చా అధ్యక్షులు సత్యవతి, బీజేపీ సీనియర్ నాయకులు నల్లా రవీందర్‌రెడ్డి, గడ్డం రవీందర్, కంతి లింబాద్రి, తిరుమల గిరి, పోల్సాని అనిల్‌రావు, పెద్ది రమేష్, పిట్టల భూమన్న, ఇనుముల స్వామి, ప్రధాన కార్యదర్శులు కొండవేణి రమేష్, జెట్టి సురేందర్, మాజీ సర్పంచ్ చెక్కిళ్ల భూమాగౌడ్, పెంబి మాజీ ఎంపీటీసీ రామ్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి బట్టు వరుణ్, నాయకులు పెట్టం శేఖర్, పుప్పాల పవన్, తగిలపల్లి జీవన్, తదితరులున్నారు.



తిరంగా ర్యాలీ సందర్భంగా ఖానాపూర్‌లో బైక్ ర్యాలీ

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రతలు పాటించండి

● నిర్మల్ జిల్లా పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్

కుభీర్, మే, 24 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని నిర్మల్ జిల్లా పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని న్యూ సాంవ్లీ, అంతర్ని, కస గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. ముఖ్యంగా తాగునీటి వనరుల వద్ద మురికి నీరు చేరకుండా జాగ్రత్తలు పాటిస్తూ కుళాయిల వద్ద మంచినీటి ట్యాంకులో వారానికోసారి క్లోరినేషన్ చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్లాస్టిక్ క్యారిబ్యాగ్‌లు వాడకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రధాన మురికి కాలువల్లో పూడికను తొలగించి వరద నీరు మ్యాదర, వడ్డెర కాలనీల్లోకి చేరకుండా చూడాలని ఎంపీడీవో సాగర్ రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో సుదర్శన్, ఎంపీవో మోహన్ సింగ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

# సోన్ మండలంలోని విత్తన డీలర్స్‌షాప్‌లలో తనిఖీలు



విత్తన డీలర్స్‌షాప్‌లో తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి, ఎస్సై

సోన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని విత్తనాల డీలర్స్ షాప్‌లను మండల వ్యవసాయ అధికారి వినోద్, సోన్ ఎస్సై గోపి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనలనే అమ్మాలని తెలిపారు. ఎవరైనా నకిలీ విత్తనాలను రైతులకు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు కూడా విత్తనాలను కొన్నప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా గ్రామాల్లో తిరుగుతూ లూస్ విత్తనాలను అమ్మితే సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

మామడ, మే 24 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం మామడ మండలం పొన్కల్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది కాకుండా గన్ని బ్యాగుల కొరత లేకుండా చూడాలన్నారు. ఐకేపీ సీసీ సవిత, ఆత్మ కమిటీ డైరెక్టర్ నర్సారెడ్డి, ఇప్ప రవీందర్‌రెడ్డి, ఐకేపీ సెంటర్ నిర్వాహకులు శ్రీనివాస్, రైతులు ఉన్నారు.

### మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల

## విద్యార్థులకు ఉత్తమ ప్రతిభా పురస్కారం

ఖానాపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉత్తమ ప్రతిభా పురస్కారం అవార్డు దక్కినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావు తెలిపారు. పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన ఐదుగురు విద్యార్థులు శ్రీవల్లి, రాజు, ఆదర్శిని, స్నిగ్ధ, రోహిత్ రాజ్‌లకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కలెక్టర్ చేతుల మీదుగా శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో ఉత్తమ ప్రతిభా పురస్కారం అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్న విద్యార్థులను శనివారం సాయంత్రం పాఠశాలలో ఘనంగా సన్మానించినట్లు ఆయన పేర్కొన్నారు.

## కుభీర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా గంగాధర్

కుభీర్, మే, 24 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా సట్ల గంగాధర్ శనివారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు హెచ్ఎంగా విధులు నిర్వహించిన జే. సాయన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో సీనియర్ ఉపాధ్యాయుడికి పదవి బాధ్యతలు అప్పగించారు. ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పాటుపడతానన్నారు


భీంపూర్ మండలం నిపానిలో మూతబడి కనిపిస్తున్న బెల్ట్‌దుకాణం


విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మద్యం సీసాలు


ఇచ్చోడలో మూసి ఉంచిన బెల్ట్ దుకాణం

# మద్యం అమ్మకాలు.. ఢమాల్!



- ఎస్పీ ఝలక్‌తో జిల్లాలో బెల్ట్‌షాపుల బంద్
- ఎక్సైజ్ శాఖలో మొదలైన టార్గెట్‌ల లొల్లి
- మత్తును వదిలి దారిలో పడుతున్న గ్రామాలు
- సేల్స్ పడిపోవడంతో లిక్కర్ మాఫియా తర్జన భర్జన
- ఏప్రిల్ మొదటి వారం నుంచి బెల్ట్‌షాపుల మూసివేత
- జిల్లావ్యాప్తంగా అధికారికంగా 42 మద్యం దుకాణాలు ఉండగా.. అనధికారికంగా 2 వేలకు పైగా బెల్ట్ దుకాణాలు

ఆదిలాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం అక్రమ అమ్మకాలపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కొరడా ఝులిపించడంతో సేల్స్(అమ్మకాలు) భారీగా పడిపోయాయి. దీంతో ఆదాయం తగ్గి ఎక్సైజ్ శాఖ టార్గెట్‌లపై ప్రభావం పడుతుంది. ఇన్నాళ్లు లక్కీ డ్రా ద్వారా వైన్స్ షాపులను దక్కించుకున్న లిక్కర్ వ్యాపారులు అక్రమంగా గ్రామాలకు మద్యాన్ని తరలించి బెల్ట్‌షాపుల ద్వారా అడ్డగోలుగా అమ్మేసుకున్నారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి జిల్లావ్యాప్తంగా బెల్ట్‌షాపులను మూసి వేయడంతో మద్యం అమ్మకాలు సగానికి సగం పడిపోయాయి. మే మాసంలో టార్గెట్‌ను చేరుకోవడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో అధికారికంగా 42 మద్యం దుకాణాలు ఉండగా.. అనాధికారికంగా మాత్రం 2 వేలకు పైగా బెల్ట్ దుకాణాలు కొనసాగుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతి ఊరు వాడల్లో బెల్ట్ దుకాణాలను నిర్వహిస్తూ అక్రమంగా మద్యాన్ని అమ్మేసుకుంటూ.. కొందరు అడ్డగోలు సంపాదనకు ఎగబడ్డారు. గ్రామాల్లో ఎక్కువగా మద్యం మత్తులోనే నేరాలకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదులు రావడంతో జిల్లా పోలీసులు దీనిపై సీరియస్‌గా దృష్టి సారించారు. అయితే కొన్ని గ్రామాల్లో పగలంతా బెల్ట్ షాపులను మూసి ఉంచుతున్నా.. రాత్రి వేళల్లో గుట్టు చప్పుడుకాకుండా అమ్మకాలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే మద్యం అక్రమ అమ్మకాల నిషేదంపై ఎక్సైజ్ శాఖ అధికారులు జిల్లా ఎస్పీని కలిసి పరిస్థితిని వివరించే ప్రయత్నం చేసినా.. ప్రయోజనం లేకపోవడంతో సైలెంటై పోయినట్లు తెలిసింది.

**స్టేషన్ల వారీగా మే 23 వరకు మద్యం సేల్స్ వివరాలిలా..**

| స్టేషన్ | ఐఎంఎల్ కేసులు | బీఆర్ కేసులు | వచ్చిన ఆదాయం | రావాల్సిన ఆదాయం |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 17,823 | 9,785 | రూ.12,95,91,283 | రూ.6,66,75,094 |
| ఇచ్చోడ | 9,000 | 7,650 | రూ.7,30,07,743 | రూ.2,48,73,563 |
| ఉట్నూర్ | 6,521 | 4,822 | రూ.5,03,91,320 | రూ.2,20,39,313 |
| | | మొత్తం | రూ.25,29,90,346 | రూ.11,35,87,970 |

## అధికారుల తంటాలు

ప్రతీనెల ప్రభుత్వం విధించే టార్గెట్‌లను చేరుకోవడానికి ఎక్సైజ్ శాఖ అధికారులు పడరాని తంటాలు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా బెల్ట్‌షాపులను మూసి వేయడం తో సేల్స్ భారీగా పడిపోతున్నాయని లిక్కర్ వ్యాపారులు పేర్కొంటున్నారు. అయినా టార్గెట్‌ను చేరుకునేందుకు అధికారులు వ్యాపారుల వెంట పడి మరి మద్యం కేసులను లిఫ్ట్ చేయిస్తున్నట్లు తెలుస్తుంది. 2024 మే నెలలో రూ.36,65, 78,317 అమ్మకాలు జరుగగా.. 2025 మే 23 వరకు రూ.25,29,90,346 అమ్మకాలు జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన 8 రోజుల్లో రూ.11,35,87,971 అమ్మకాలు జరగాల్సి ఉంది. అయితే ఇది సాధ్యమయ్యే పని కాదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో మే మాసంలో భారీగా నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. బెల్ట్‌షాపులపై పోలీసుల నిఘా పెరిగి పోవడంతో అమ్మేందుకు వ్యాపారులు జంకుతున్నారు. అలాగే మద్యం దుకాణాల నుంచి లిక్కర్‌ను గ్రామాలకు తరలించేందుకు వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నారు. ప్రభుత్వ టార్గెట్‌ను చేరుకునేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు పడరాని పాట్లు పడుతున్నారు. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల నుంచి తీవ్రమైన ఒత్తిళ్లు పెరిగి పోవడంతో సతమతమవుతున్నారు.

## ప్రశాంతంగా పల్లెలు

బెల్ట్ దుకాణాల వ్యాపారానికి అడ్డుకట్ట వేయడంతో పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుంది. గతంలో ఉదయం 7గంటల నుంచి రాత్రి 12గంటల వరకు విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరిగేవి. దీంతో పలురకాల గొడవలు, వివాదాలకు దారి తీసేది. కొన్ని సందర్భాల్లో మద్యం మత్తులో ఆత్మహత్యలకు పాల్పడిన దాఖలాలు కూడా ఉన్నాయి. అలాగే వ్యవసాయ పనులకు కూడా ఆటంకాలు ఎదురయ్యాయి. ప్రస్తుతం అన్ని గ్రామాలతో పాటు పట్టణంలోని వార్డుల్లో బెల్ట్ దందాకు చెక్ పడింది. అక్కడక్కడ దొంగచాటున కొందరు మద్యాన్ని విక్రయిస్తున్న పెద్దగా అమ్మకాలు జరుగడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మత్తును వదిలి పల్లెలు ఇప్పుడిప్పుడే దారిలో పడుతున్నాయి. పోలీసు స్టేషన్లలోను కేసుల సంఖ్య తగ్గుముఖం పడుతున్నట్లు తెలుస్తుంది. గతంలో బెల్ట్ దందా పై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకునే పరిస్థితి ఉండేది కాదు. ప్రస్థుతం జిల్లా

(తరువాయి 6వ పేజీలో...)


శని దేవుడి విగ్రహానికి పూజలు చేస్తున్న మహిళలు

## శని దేవుడికి ప్రత్యేక పూజలు

తాంసి, మే 24(ఆంధ్రజ్యోతి): శని దేవుడికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శనివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో శని దేవుడికి నవధాన్యాలతో పాటు నువ్వుల నూనెను సమర్పించారు. కొందరు నల్ల వస్త్రాలను ధరించి పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆయా గ్రామాల్లో శని దేవడికి పూజలు చేసేందుకు కోసం జనం బారులు తీరారు. మండలకేంద్రంలోని రామేశ్వర ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. అలాగే పొన్నారి, కప్పర్ల, బండ నాగపూర్, హసనాపూర్ గ్రామాలలో పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఎండ తాకిడి లేకుండా ఉండేందుకు కోసం పలుచోట్ల ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. మొత్తంమీద శని దేవునికి పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి.

## పొచ్చెర జలపాతం సందర్శనకు అనుమతులు లేవు

బోథ్, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర జలపాతం సందర్శనకు అనుమతులు లేవని రేంజి అధికారి ప్రణయ్ తెలిపారు. భారీ వర్షాల కారణంగా జలపాతం సందర్శన కోసం వచ్చే వారికి అనుమతి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఈ విషయాన్ని గమనించి జలపాతం సందర్శనను విరమించుకోవాలని, జలపాతం సందర్శన సమయంలో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని పేర్కొన్నారు.

## వంకాయ పంటకు ఎల్లో ఫంగస్

తాంసి, మే 24(ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు ఆశాజనకంగా కనిపించిన వంకాయ సాగుకు ఎల్లో కలర్ ఫంగస్ తెగులు సోకింది. పచ్చగా ఉండాల్సిన పంట పసుపు రంగుకు మారిందని రైతులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సుమారు 80 ఎకరాలలో ఈ పంట సాగవుతోంది. ప్రస్తుతం పంట కోతకు వచ్చే సమయంలోనే ఫంగస్ తెగులు సోకడం పట్ల సాగు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఒక పక్క సాగునీరు కరవవడం, మరో పక్క ఫంగస్ తెగులుతో తమకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. ఫంగస్ తెగులు నివారణకు చర్యలు తెలపాలని మండల రైతులు కోరుతున్నారు.


తెగులు సోకిన వంకాయ పంట

# చదువుతోనే ఆదివాసీల అభివృద్ధి

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- గాదిగూడ మండలంలో 'పోలీస్ మీకోసం' కార్యక్రమం
- యువతకు స్పోర్ట్స్ కిట్ల అందజేత


యువతకు ఆట వస్తువులను అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్


పూనగూడ గ్రామంలో మాట్లాడుతూ..

నార్నూర్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి చదువు వల్ల సాధ్యమని, ఆదిలాబాద్ జిల్లాకు అడవుల జిల్లా, ఆదివాసీల జిల్లాగా పేరుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని మారుమూల గ్రామాలైనా కుండి, షేకుగూడ, పిప్రి(జీ), పూనగూడ గ్రామాలలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ కలిసి 'పోలీస్ మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు వారికి ఆదివాసీలు సంప్రదాయ నృత్యాలతో డప్పు వాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. కాగా, పూనగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. ఈ సందర్భంగా యువతకు జిల్లా ఎస్పీ ప్రత్యేక సూచనలు చేశారు. గ్రామాల నుంచి బయటకు వచ్చి విద్యాభ్యాసంపై ప్రత్యేకశ్రద్ధ వహిస్తూ ఉన్నత విద్యను అభ్యసించి అభివృద్ధి చెందాలని, దీనివల్ల తమ గ్రామాలను అభివృద్ధి దిశగా వెళ్లే విధంగా కృషి చేయాలని అన్నారు. యువతకు త్వరలోనే గాదిగూడ మండల కేంద్రంలో ప్రత్యేకంగా ఆర్మీ అగ్నివీర్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తామన్నారు. అలలాగే, త్వరలోనే జిల్లాలో ప్రత్యేకంగా జాబ్ మేళాలు నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరూ సంసిద్ధమై ఉండాలని సూచించారు. గ్రామాలను వదిలి విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి పట్టణాలకు వెళ్లి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలను నిర్వహించాలని తెలిపారు. యువత క్రీడారంగంలోనూ అభివృద్ధి చెందాలన్నారు. కాగా, నాలుగు గ్రామాల్లోని యువతకు రెండు క్రికెట్ కిట్లు, ఆరు వాలీబాల్ కిట్లు, ఐదు ఫుట్‌బాల్‌లను అందజేసి క్రీడారంగంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా ప్రజలు వైద్యుల సలహా మేరకే మందులను వాడాలని, ఇంట్లో ఉన్న మందులను చిన్నచిన్న సమస్యలకు వాడకుండా ఉండడం శ్రేయస్కరమని సూచించారు. అనవసరంగా మందులను వాడిన వారికి కిడ్నీ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ప్రతీ గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్‌ను కేటాయించడం జరిగిందని తెలిపారు గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా.. అత్యవసరంగా స్పందించాలంటే డయల్ 100 లేదా విలేజ్ పోలీస్ ఆఫీసర్ సంప్రదించాలని తెలిపారు. మహిళల రక్షణ కోసం, అలాగే యువతులు, విద్యార్థినులు అత్యవసర సమయాల్లో ఆదిలాబాద్ షీ టీం బృందాన్ని సంప్రదించాలని తెలిపారు. షీ టీం బృందాన్ని సంప్రదించడానికి సెల్ ఫోన్ నెం. 8712659953 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో గంజాయి సాగు చేయడం వల్ల దేశ భవిష్యత్తు, యువత అనారోగ్య బారిన పడుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. గంజాయి సాగు, తాగడం, వర్తకం చేయడం, పండించడం లాంటివి చట్ట వ్యతిరేకమన్నారు. గంజాయిపై సూచించిన నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి పండించడం వల్ల కేసులు నమోదు అవుతూ ప్రభుత్వం ద్వారా వచ్చే లబ్ది రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గంజాయి దేశ భవిష్యత్తును నాశనం చేస్తుందని యువత చెడు మార్గాలను బారిన పడకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలి సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో వచ్చే బాబాలను నమ్మవద్దని, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులను సంప్రదించి సరైన వైద్యాన్ని తీసుకొని వైద్యులు సూచించిన మందులను మాత్రమే వాడేలా ప్రజలందరూ ఉండాలన్నారు. మండలంలో ఎలాంటి గంజాయి సమాచారం ఉన్న అసాంఘిక కార్యక్రమాల సమాచారం అయిన మెసేజ్ యువర్ ఎస్పీ కార్యక్రమంలోని ప్రత్యేకంగా జిల్లా ఎస్పీచే నిర్వహించబడుతున్న సెల్ నెం. 8712659973 వాట్సాప్ ద్వారా సమాచారాన్ని అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ సీఐ రహీం పాషా, గాదిగూడ ఎస్సై ఎస్.జీవన్ రెడ్డి, ఆదివాసీ నాయకుడు మెస్రం శేఖర్, యోగేష్, కుండి గ్రామ పటేల్ లక్ష్మణ్ పటేల్, షేక్ గూడ గ్రామ పటేల్ పైకు, పిప్పిరి గ్రామ పటేల్ సిడాం జగు, పూనగుడ గ్రామ పటేల్ పెందుర్ రమేష్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


బెల్సార్‌రాంపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

## తక్కువ ఖర్చుతో సుస్థిర వ్యవసాయం

- కృషి విజ్ఞాన శాస్త్రవేత్త సునీల్‌కుమార్

భీంపూర్, మే 24(ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో సుస్థిర వ్యవసాయం పట్ల రైతులు మొగ్గుచూపాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎం. సునీల్ కుమార్ అన్నారు. ఆయన శాస్త్రవేత్త డాక్టర్ పోషాద్రి, మండల వ్యవసాయ అధికారి వై.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి శనివారం మండలంలోని బెల్సార్ రాంపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలను పటిష్ఠ పరిచేందుకు సాగు ఖర్చు తగ్గించాలన్నారు. తక్కువ భూమిలో తక్కువ నీరు, తక్కువ ఎరువు వాడాలన్నారు. పంట మార్పిడి చేస్తూ ఎక్కువ దిగుబడితో సుస్థిర వ్యవసాయం దిశ అడుగువేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ వైపు కృషి చేయాలన్నారు. రైతులకు గ్రామంలో సాగు చేస్తున్న వివిధ రకాల పంటల్లో చీడ పీడలు నివారణ తక్కువ ఎరువులు వాడకంపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. రైతులు ఇంటికి ఒక చెట్టు నాటుకుని పర్యావరణం పరిరక్షించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. పంట మార్పిడి చేపట్టి బలవర్ధకమైన ఆహార పంటలను సాగు చేయాలని అన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని కొనేటప్పుడు రసీదు తీసుకొని భద్రపరచుకోవాలని సూచించారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- జిల్లా ప్రణాళిక అధికారి వెంకటరమణ

తాంసి, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వాతావరణంలో మార్పులు సంభవించడం వలన ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు కోసం చేపట్టిన పారిశుధ్యం పనులను వేగవంతం చేయాలని జిల్లా ప్రణాళిక అధికారి వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని పొన్నారి గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధం పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ఎక్కడైనా మురికినీరు నిల్వపై ఆరా తీశారు. మురికి కాలువల పరిశుభ్రతపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. దోమల తీవ్రత ఉందా? అని ప్రజలను అడిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవైనా వ్యాధులు సోకితే ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా కలుషిత నీరు తాగకుండా ఉండాలని అన్నారు. ప్రతీ వారం తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ చేయాలని కార్యదర్శులను ఆదేశించారు.

# అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలు తిరగబడతారు

- ఉన్నతాధికారుల సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, మే 24(ఆంధ్రజ్యోతి): పోడు భూముల్లో పంట సాగు చేస్తున్న రైతులకు ఇబ్బంది పెడితే సహించమని, కవ్వాల్ టైగర్‌జోన్‌ని చెక్‌పోస్టులను ఎత్తి వేయాలని, భారీ వాహనాలకు అనుమతులు ఇవ్వాలని ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తే తిరుగుబాటు చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ హెచ్చరించారు. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో శనివారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతాలలోని పోడు భూముల్లో 3 ఫేస్ కరెంట్‌కు అనుమతులు ఇవ్వాలని, అభివృద్ధి పనులకు అడ్డుకుంటే సహించబోమన్నారు. అటవీ శాఖ అధికారులు అమాయక ఆదివాసీ ప్రజలతో పాటు ఎస్సీ, బీసీ, మైనార్టీ ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు. లేదంటే తిరుగుబాటు తప్పదని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలను అటవీ శాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేసి అక్రమ కేసులు పెట్టడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఏసీ రూముల్లో విధులు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులను పావులుగా వాడుకొని ప్రజలకు ఇబ్బందులు చేయడం సమంజసం కాదన్నారు. ఇందిరా సౌర గిరిజల వికాసం పథకంలో మంజూరైన బోరుబావులను వేయడానికి తప్పనిసరిగా అనుమతులు ఇవ్వాలన్నారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లో భారీ వాహనాలకు సైతం అనుమతులు ఇవ్వాలని అన్నారు.

- గిరిజనేతర రైతులను ఇబ్బంది పెట్టొద్దు : బోథ్ ఎమ్మెల్యే

**నేరడిగొండ:** ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల పంచాయతీ రాజ్, ఆర్ అండ్‌బి పనులకు సంబంధించిన అటవీ అనుమతుల ఇబ్బందులపై రాష్ట్ర పంచాయతీ రాజ్, అటవీ శాఖ మంత్రులు అలాగే అటవీ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డా. సువర్ణ గార్ల అధ్యక్షతన ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, సీసీఎఫ్,డీఎఫ్‌వోలతో హైదరాబాద్ సెక్రటేరియేట్‌లో శనివారం జరిగిన సమీక్ష సమావేశానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్‌లోని బోథ్ నియోజకవర్గంలో అనేకమైన గిరిజన గ్రామాలకు రోడ్లు కేవలం అటవీ అనుమతుల కోసం నిలిచిపోయాయన్నారు. అక్కడి ఆదివాసీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అదేవిధంగా నియోజకవర్గంలో అతిముఖ్యమైన రోడ్లు బరంపూర్-మోర్ధండి, సిరిచేల్మా-పెంబి, భూతాయి-డెడ్రా, గురుజ-అంకపూర్, మోహద, వెంకటపూర్-కుంటాల, పీచర, బొందిడి-రాగపూర్, ఈస్పూర్-గోండుగూడ, ఇస్పూర్-ఏనుగుడా రోడ్లకు అటవీ అనుమతులు వెంటనే ఇవ్వాలని కోరారు. అలాగే, బోథ్ నియోజకవర్గంలో గిరిజనేతర (ఎస్సి, బిసి, మైనార్టీ,) పోడు రైతులకు అటవీ అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని, ఆటంకాలు కల్గిచ్చొద్దంటూ పలు అంశాలపై మాట్లాడారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్